# సాక్షి నిర్మల్

ఆదివారం । 19 । నవంబర్ । 2023







**ఈవీఎం-విశేషాలు ..**

సమర్థవంత ఎన్నికల నిర్వహణకు కేంద్ర ఎన్నికల సంఘం అనేక సంస్కరణలు చేపట్టింది. ఇందులో భాగంగా ఓటింగ్ విధానంలో మార్పులు తెచ్చింది. నవంబర్ 30న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఈవీఎం విశేషాలపై కథనం..

10లో▸



**అవస్థల్లో 'అల్లంపల్లి'** 11లో▸

ప్రభుత్వ పథకాలతో గ్రామాలు అభివృద్ధి బాటపడుతుంటే.. కవ్వాల్‌టైగర్ జోన్ ఆంక్షలతో పలు గ్రామాల అభివృద్ధి కుంటుపడుతోంది. మండలంలోని ఉమ్మడి అల్లంపల్లి గ్రామ పంచాయతీ కనీస సౌకర్యాలు లేక కొట్టుమిట్టాడుతోంది.

**వాతావరణం**

గరిష్టం/కనిష్టం 33.2 / 19.3

వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. రాత్రి చలి ప్రభావం పెరుగుతుంది.

## న్యూస్‌రీల్

### ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్
- ఈవీఎం కమిషనింగ్‌పై సెక్టార్ అధికారులకు శిక్షణ



శిక్షణ శిబిరంలో పాల్గొన్న కలెక్టర్ ఆశిష్

నిర్మల్‌చైన్‌గేట్: సెక్టార్ అధికారులు శిక్షణలో చెప్పిన అంశాలను అవగాహన చేసుకుని, ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. ఈవీఎం కమిషనింగ్‌పై సెక్టార్ అధికారులకు కలెక్టరేట్ సమావేశం మందిరంలో శనివారం శిక్షణ ఏర్పాటు చేశారు. మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని 91 మంది సెక్టార్ అధికారులకు బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ కిశోర్ కుమార్, జిల్లా నోడల్ అధికారి, డీ ఈవో రవీందర్‌రెడ్డి, సమన్వయ కర్త లింబాద్రి, మాస్టర్ ట్రైనర్లు బచ్చు శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, వేణుగోపాల్ పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే అభ్యర్థుల ఖర్చుల వివరాలు పరిశీలన

ముథోల్: ముథోల్ నియోజకవర్గ పరిధిలో బరిలో ఉన్న ఎమ్మెల్యే అభ్యర్థుల ఖర్చుల వివరాలను వ్యయ పరిశీలకులు శనివారం పరిశీలించారు. ముథోల్‌లో ఎన్నికల రిటర్నింగ్ కార్యాలయంలో వ్యయ పరిశీలకులు శ్రేయస్‌గుప్తా అభ్యర్థులు ఇది వరకు ఎన్నికల్లో పెట్టిన ఖర్చులను పరిశీలించారు. ఆయా పార్టీల అభ్యర్థుల తరపున వచ్చిన వ్యక్తులు ఖర్చుల వివరాలను వ్యయ పరిశీలకునికి అందజేశారు. మొత్తం 11 మంది అభ్యర్థులకు సంబంధించి ఖర్చు వివరాలను అందజేశామని అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి అతికొద్దీన్ తెలిపారు.

### 'గురుకులం' తనిఖీ



జవాబు పత్రాలు పరిశీలిస్తున్న గోపీచంద్

లక్ష్మణచాంద: మండలంలోని రాచాపూర్ మహాత్మ జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రాంతీయ సమన్వయ అధికారి గోపీచంద్ శనివారం తనిఖీ చేశారు. విద్యార్థుల త్రైమాసిక పరీక్షల జవాబు పత్రాలను పరిశీలించారు. ఇంటర్, పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. స్టడీ అవర్స్ నిర్వహించాలని తెలిపారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్ ఉన్నారు.

### సమన్వయంతో పనిచేయాలి

- బీఆర్‌ఎస్ ముథోల్ ఇంచార్జి పురాణం సతీశ్

కుంటాల: బీఆర్‌ఎస్ గెలుపు కోసం పార్టీ కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని మాజీ ఎమ్మెల్సీ, ముథోల్ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి పురాణం సతీశ్ సూచించారు. కుంటాలలో పార్టీ ప్రచార కార్యక్రమాలపై శనివారం నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలు దేశానికి ఆదర్శమన్నారు. బీజేపీ రాష్ట్రంలో మతకల్లోలాలను ప్రోత్సహిస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రవేశపెట్టిన మేనిఫెస్టోతో ప్రజలకు ఏమాత్రం ఉపయోగకరంగా లేదని ఆరోపించారు. సమష్టిగా కలిసి పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ దత్తాద్రి, జెడ్పీటీసీ కొత్తపల్లి గంగామణి బుచ్చన్న, ప్యాక్స్ చైర్మన్ సట్ల గజ్జారాం, మాజీ ఆత్మ చైర్మన్ సవ్వి అశోక్‌రెడ్డి, శంకర్‌గౌడ్, జుట్టు మహేందర్, దొనికెన వెంకటేశ్, నర్సింగ్‌రావు, రమణగౌడ్, శంకర్‌గౌడ్, సర్పంచుల సంఘం మండల కన్వీనర్ ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ముథోల్‌ను దత్తత తీసుకుంటా..



వేదికపై అభివాదం చేస్తున్న బండి సంజయ్, రామారావు పటేల్, బీజేపీ నాయకులు



మాట్లాడుతున్న బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి సంజయ్

- అధికారంలోకి రాగానే భైంసాను మహిషాగా మారుస్తాం
- బాసర సరస్వతీదేవి ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం
- రైల్వేలైన్‌సహా పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేస్తాం
- హిందూ సమాజం ఓటుబ్యాంకుగా మారాలి..
- పవార్ రామారావుపటేల్‌ను గెలిపించుకోవాలి
- బహిరంగసభలో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్



భైంసా బీజేపీ ఎన్నికల ప్రచార సభకు హాజరైన ప్రజలు

భైంసా/భైంసాటౌన్: ''ముథోల్‌లో బీజేపీ గెలవాలని రామారావుపటేల్ నవ యువకుడిలా కొట్లాడుతున్నాడు.. ఇక్కడ బీజేపీ గెలుపును రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల ప్రజలు కోరుకుంటున్నారు.. మరి మీ ముథోల్‌వాసులు కోరుకోవడం లేదా.. మీరు ఎవరికీ భయపడకండి.. నేను అండగా ఉంటా.. ఓటుబ్యాంకుగా మారండి.. ముథోల్‌లో బీజేపీని గెలిపించాలని ఛాలెంజ్ చేస్తున్నా.. గెలిపించుకుంటారా'' అంటూ బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ పార్టీ శ్రేణులను, సభకు హాజరైన జనాలను ఉద్దేశించి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం భైంసాకు వచ్చిన ఆయన బీజేపీ అభ్యర్థి పవార్‌రామారావుపటేల్‌తో కలిసి బహిరంగ సభలో పాల్గొని మాట్లాడారు. హెలిక్యాప్టర్‌లో మధ్యాహ్నం 1.30 గంటలకు భైంసా చేరుకున్న సంజయ్ సభాస్థలికి చేరుకుని ప్రజలకు అభివాదం చేశారు. ప్రసంగం ప్రారంభంలో భారత్‌మాతాకీజై, జైశ్రీరాం, బాసర సరస్వతి మాతాకీజై, జైభీం, జై సేవాలాల్.. అని నినదిస్తూ పార్టీ శ్రేణులను ఉత్సాహపరిచారు. అనంతరం మాట్లాడుతూ.. బీజేపీ అధికారంలోకి వస్తే ముథోల్ నియోజకవర్గాన్ని తాను దత్తత తీసుకుని అన్నివిధాలా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. నాందేడ్ నుంచి భైంసా-నిర్మల్ మీదుగా మంచిర్యాల వరకు రైల్వే లైన్ నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. నైపుణ్య శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. బాసర ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. హైదరాబాద్ నుంచి బోధన్- బాసర మీదుగా భైంసా వరకు నిర్మిస్తున్న జాతీయ రహదారిని మహారాష్ట్రలోని మాహోర్ వరకు పొడిగించాలనే ప్రజల డిమాండ్‌ను కేంద్రం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. పత్తి పంట బాగా పండే ముథోల్ నియోజకవర్గంలో టెక్స్‌టైల్ పార్క్, పీజీ కాలేజీ, ఈఎస్‌ఐ ఆసుపత్రి ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. గోదావరిపై ఎత్తిపోతల పథకాలు నిర్మించి రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరందిస్తామన్నారు. గడ్డెన్నవాగు ప్రాజెక్టు కాలువల నిర్మాణాన్ని పూర్తి చేస్తామన్నారు. పల్సికర్ రంగారావు ప్రాజెక్టు ముంపు గ్రామాన్ని ఆదుకుంటామని తెలిపారు.

**మహిషాగా మారుస్తాం...**

'ముథోల్‌లో రామారావు పటేల్ గెలిచాక మళ్లీ భైంసాకు వస్తా... భైంసాను మహిషాగా మారుస్తా' అని బండి సంజయ్ అన్నారు. సంక్రాంతి పండుగ అంటే భైంసానే గుర్తుకువస్తోందని, నా హిందూ సోదరులు కేసులతో జైలులో నరకయాతన అనుభవించారని బండి భావోద్వేగానికి గురయ్యారు. బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడితే ఇక్కడి ఎమ్మెల్యే ట్రిపుల్ ఐటీకి ఒక్కసారైనా వెళ్లాడా అని ప్రశ్నించారు. బాసర సరస్వతీ అమ్మవారి ఆలయ అభివృద్ధికి నయాపైసా ఇవ్వలేదన్నారు. చదువుల తల్లి ఆలయాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారన్నారు. ముథోల్‌లో బీజేపీ కోసం ప్రతిఒక్కరు ఛత్రపతి శివాజీలా కదం తొక్కాలన్నారు. డిసెంబర్ 3న ముథోల్‌లో విజయోత్సవాలు జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి, పార్లమెంట్ ప్రభారి అల్జాపూర్ శ్రీనివాస్, జిల్లా ఇన్‌చార్జి మల్లారెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవిపాండే, నారాయణ్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ తాడేవార్ సాయినాథ్, ప్రధాన కార్యదర్శి పి గంగాధర్, పట్టణాధ్యక్షులు మల్లేశ్వర్, నాయకులు దిలీప్, రవి, పోశెట్టి, గౌతం పింగ్లే, సాహెబ్‌రావు, తోట విజయ్, కపిల్ సింధే, సాల్లి రమేశ్, రాజేశ్‌బాబు, సోలంకి భీంరావు, జీవీ.రమణారావు, ఆప్క గజ్జరాం, పండిత్‌రావు, గోపాల్‌సర్డా తదితరులు పాల్గొన్నారు.

### దండం పెడుతున్నా.. ఒక్కసారి గెలిపించండి..



నమస్కరిస్తున్న రామారావ్‌పటేల్, కుమారులు

భైంసాటౌన్: 'ముథోల్‌లో బీజేపీని గెలిపించండి.. రెండు చేతులతో దండం పెడుతున్నా.. పదేళ్లుగా ప్రజాసేవలో ఉన్నా.. చివరిసారి అవకాశమివ్వండి.. సదా మీసేవలో ఉంటా' అని ముథోల్ బీజేపీ అభ్యర్థి పవార్ రామారావు పటేల్ భైంసాలో భావోద్వేగంతో మాట్లాడారు. తనను గెలిపిస్తే ముథోల్‌ను అన్నివిధాల అభివృద్ధి చేస్తానంటూ సంకల్పపత్రం(మేనిఫెస్టో) చదివి వినిపించారు. అనంతరం సంకల్పపత్రం బండి సంజయ్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. అంతకుముందు మాట్లాడుతూ.. తాను ధర్మరక్షణ కోసమే బీజేపీలో చేరానని, కాంగ్రెస్ నుంచి గెలిచి బీఆర్‌ఎస్‌లో చేరినవారు తాను గెలిస్తే పార్టీ మారతారని ప్రచారం చేస్తున్నారన్నారు. ముథోల్‌లో రెండుసార్లు అధికారంలో ఉన్న స్థానిక ఎమ్మెల్యే ఎలాంటి అభివృద్ధి చేయలేదని విమర్శలు చేశారు. బీజేపీ అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలు నిలిచిపోతాయని తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. అనంతరం మేనిఫెస్టో ప్రకటించారు.

**సంకల్ప పత్రంలో..**

భైంసాను మహిషాగా మారుస్తాం. గోశాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తాం. కేంద్రనిధులతో బాసర అభివృద్ధి. ముథోల్‌లో మార్కెట్ యార్డు ఏర్పాటు. భైంసాలో మహిళా డిగ్రీ కళాశాల ఏర్పాటు. పంట ఉత్పత్తుల రవాణాకు బాసరలో వ్యాగన్ సెంటర్ ఏర్పాటు, గడ్డెన్నవాగు ప్రాజెక్టు కాల్వల నిర్మాణం, డ్వాక్రా మహిళలకు భవనాలు, సిరాల ప్రాజెక్టు నిర్మాణం, బాసర ట్రిపుల్‌ఐటీలో సమస్యల పరిష్కారం, గుండెగాం పునరావాసం కల్పిస్తామని సంకల్ప పత్రంలో పేర్కొన్నారు.

### ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు చేయాలి



కౌంటింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న అధికారులు

నిర్మల్‌చైన్‌గేట్: ఓట్ల లెక్కింపు ప్రక్రియకు ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఆశిష్ సంగ్వాన్ అన్నారు. స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్, స్ట్రాంగ్ రూమ్ కేంద్రాలను మూడు నియోజకవర్గాల పరిశీలకులు రవి రంజన్ కుమార్ విక్రమ్, కె.గోపాలకృష్ణ సాధారణ పరిశీలకులు లక్ష్మణ్ నింబర్గి, ఎస్పీ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి శనివారం పరిశీలించారు. మూడు నియోజకవర్గాలకు సంబంధించి స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలలో చేస్తున్న ఏర్పాట్లను తనిఖీ చేశారు. నిర్మల్, ముథోల్, ఖానాపూర్ నియోజకవర్గాల కౌంటింగ్ కోసం ఏర్పాటు చేసిన గదులను పరిశీలించి తగు సూచనలు చేశారు. పార్కింగ్ సదుపాయాలతోపాటు, భద్రతాపరమైన అంశాలను పరిశీలించారు. అవసరమైన చోట సీసీ కెమెరాలు, లైటింగ్, ఫ్యాన్స్ ఏర్పాటు చేయాలన్నారు. బారికేడ్లు, పార్కింగ్ వసతులు కల్పించి ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వారివెంట అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్, ఆర్డీవో ఉన్నారు.

### జాబ్ ట్రైనింగ్‌ను తనిఖీ చేసిన డీఐఈవో



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఐఈవో

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వొకేషనల్ కోర్సుల విద్యార్థుల జాబ్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని డీఐఈవో జాదవ్ పరశురాంనాయక్ శనివారం తనిఖీ చేశారు. వొకేషనల్‌లోని క్రాప్ ప్రొడక్షన్, ఎంపీహెచ్‌డబ్ల్యూ, ఈటీ, కోర్సుల విద్యార్థుల శిక్షణ కార్యక్రమాన్ని సందర్శించి మాట్లాడారు. శిక్షణ పొందే విద్యార్థులకు దీనిపై ప్రత్యేకంగా 50 మార్కులు ఉంటాయని, వారి శిక్షణ ఆధారంగా వారికి మార్కులు వస్తాయన్నారు. సంబంధిత కోర్సులు చేసిన విద్యార్థులు కోర్సు పూర్తయ్యాక ఉండే ఉద్యోగ అవకాశాలు, ఉద్యోగం వచ్చాక చేయాల్సిన పనులపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నట్లు వెల్లడించారు. శిక్షణ అనంతరం జాబ్‌ట్రైనింగ్ సర్టిఫికెట్ అందిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హమీద్, అధ్యాపకుడు గాడ్వాలే సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు మహాశయా.. నమస్కారం!

- సాంకేతిక పరిజ్ఞానంతో ఓటర్ల చెంతకు నేతలు
- మొబైల్ ప్రచారంలో అన్ని పార్టీల అభ్యర్థులు
- సంక్షిప్త సందేశాలు, ఐవీఆర్‌ఎస్ వాయిస్ కాల్స్



నిర్మల్ ఖిల్లా: జిల్లాకేంద్రానికి చెందిన సుధీర్ తన నిత్యజీవితంలో భాగంగా పనిలో ఉన్నాడు. అప్పుడే మొబైల్ ఫోన్ రింగవుతోంది. వెంటనే ఫోన్ ఎత్తాడు.. అవతలి వైపు నుంచి 'నమస్తే.. నేను మీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిని ఈ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న.. మీ ఓటును మన పార్టీ గుర్తుకే వేసి నన్ను గెలిపించాలని అభ్యర్థిస్తున్నా..! అంటూ రికార్డెడ్ వాయిస్ కాల్...'

మీకు మీ కుటుంబ సభ్యులకు దసరా దీపావళి పర్వదిన శుభాకాంక్షలు.. ఇట్లు మీ ఎమ్మెల్యే అభ్యర్థి, నిర్మల్ అసెంబ్లీ నియోజకవర్గం... అంటూ ఎస్‌ఎంఎస్.

ఇలా సంక్షిప్త సందేశాలు, వాయిస్ కాల్స్‌తో నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థుల నుంచి ఓటర్లకు అభ్యర్థన పర్వం కొనసాగుతోంది..

ఇక పోలింగ్ రోజు సమీపిస్తుండడంతో ఓటర్లను ఆకట్టుకునేందుకు బరిలోఉన్న ఆయా రాజకీయ పార్టీల అభ్యర్థుల మొబైల్ ప్రచార పర్వం జోరుగా కొనసాగుతుంది. సమయం దగ్గరపడుతుండడంతో ఇప్పటికే సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. దీనికి తోడు ఐవీఆర్‌ఎస్ వాయిస్ కాల్స్, సంక్షిప్త సందేశాల ద్వారా ఓటర్ల చెంతకు వచ్చేస్తున్నారు. తమ పార్టీకే ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. గడప గడపకూ భౌతికంగా ఓటరును చేరుకోలేని అభ్యర్థులు సమయాభావంతో విశాలమైన నియోజకవర్గ ప్రాంతాలన్నీ పర్యటించలేని కారణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటున్నారు. మొబైల్ ఫోన్లకు ఐవీఆర్‌ఎస్(ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టం)వాయిస్ కాల్స్ ద్వారా, ఎస్‌ఎంఎస్‌ల ద్వారా ప్రజలకు చేరువయ్యే ప్రయత్నం చేస్తున్నారు. ఇదే నెలలో ఇటీవల దసరా, దీపావళి పర్వదినాలు రావడంతో బల్క్ ఎస్‌ఎంఎస్‌ల ద్వారా అందరికీ పండగ శుభాకాంక్షలను కూడా తెలిపారు. ఓటర్లను ఆకట్టుకునే అనేకరకాల దారులు వెతుకుతున్నారు.

**నేరుగా.. పార్టీల వారీగా...**

ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు శతవిధాలా ప్రయత్నం చేస్తున్న అభ్యర్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ఓటర్ల జాబితా ఆధారంగా వారి ఫోన్ నంబర్లను సేకరించి వారి మొబైల్ ఫోన్‌కు ఎస్‌ఎంఎస్‌లు, వాయిస్ కాల్స్ ద్వారా తమ ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. అధికార బీఆర్‌ఎస్ పార్టీ చేపడుతున్న పథకాలు మున్ముందు చేపట్టబోయే హామీలను వాయిస్ కాల్స్‌లో వివరిస్తూ తమకే మరోసారి పట్టం కట్టాలని కోరుతున్నారు. మరోవైపు ప్రత్యర్థి పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు ఈసారి తమకే అవకాశం కల్పించాలని తమ అమూల్యమైన ఓటును తమకే వేయాలని అభ్యర్థిస్తున్నారు.

**నిమిషం నిడివితో..**

ఎమ్మెల్యే అభ్యర్థుల వాయిస్‌ని ఒక నిమిషం నుంచి రెండు నిమిషాల నిడివితో రికార్డ్ చేసి సేకరించిన ఓటర్ల ఫోన్ నంబర్లకు వాయిస్ కాల్స్ వెళ్లేలా చూస్తున్నారు. కాల్ వచ్చిన ఓటరు లిఫ్ట్ చేయగానే సంబంధిత రాజకీయ పార్టీ తరపున బరిలో ఉన్న అభ్యర్థి వాయిస్ వినిపించేలా ఏర్పాటు చేస్తున్నారు. ఇదే విధంగా దాదాపు 150 అక్షరాలతో సంక్షిప్త సందేశాన్ని తయారుచేసి ఇంగ్లిష్, తెలుగు భాషల్లో తమ నియోజకవర్గ పరిధిలోని ఓటర్ల మొబైల్ నంబర్లకు పంపుతున్నారు.

# స్వేచ్ఛా వాతావరణంలో ఎన్నికలు!

- రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు అజయ్‌నాయక్, దీపక్



సమీక్ష నిర్వహిస్తున్న రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు

నిర్మల్‌చైన్‌గేట్: ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటిస్తూ, పూర్తి అవగాహనతో ఎలాంటి పొరపాట్లు జరగకుండా ఎన్నికల విధులను నిర్వర్తించాలని, ఎన్నికలు శాంతియుత, స్వేచ్ఛా వాతావరణంలో జరిగేలా సహకరించాలని రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు అజయ్‌నాయక్ (రిటైర్డ్ ఐఏఎస్), దీపక్ (రిటైర్డ్ ఐపీఎస్)అన్నారు. కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో జిల్లా ఎన్నికల అధికారి ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ ప్రవీణ్ కుమార్‌తో కలిసి రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులతో శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటించాలని ఆదేశించారు. ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటుహక్కు వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై నిఘా ఉంచాలన్నారు. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు ప్రచారాలను గుర్తించాలని, ఎన్నికల కోడ్ ఉల్లంఘనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

**విధులపై అవగాహన ఉండాలి...**

రిటర్నింగ్ అధికారులకు ఎన్నికల నిర్వహణలో భాగంగా నిర్వహించే విధులు, కార్యకలాపాలపై పూర్తి అవగాహన ఉండాలని సూచించారు. ఈవీఎంల నిర్వహణపై, బ్యాలెట్ పేపర్ ప్రింటింగ్ తదితర అంశాలపై అవగాహన ఉండాలన్నారు. బ్యాలెట్ పత్రాల ముద్రణలో తప్పిదాలకు ఆస్కారం ఇవ్వొద్దని సూచించారు. రిటర్నింగ్ అధికారి పరిధిలోని అన్ని టీంలకు వారికి కేటాయించిన విధులపై అవగాహన కల్పించాలని రిటర్నింగ్ అధికారులకు సూచించారు. ఈవీఎంలు, వీవీప్యాట్‌లను పంపిణీ కేంద్రాల నుంచి పోలింగ్ ముగిసిన తరువాత రిసెప్షన్ సెంటర్లకు జాగ్రత్తగా తీసుకువెళ్లే విధంగా పోలింగ్ విధులు నిర్వహించే సిబ్బందికి అవగాహన కల్పించాలని తెలిపారు. సిబ్బందికి వాహనాలు ఏర్పాటు చేసి, పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన సదుపాయాలు కల్పించాలని పేర్కొన్నారు. పీడబ్ల్యూడీ, సీనియర్ సిటిజన్స్‌కు ఫామ్- 12డి ఇవ్వాలన్నారు. ప్రతీ ఓటర్‌కు ఓటర్ సమాచార స్లిప్పులను వంద శాతం పంపిణీ చేయాలని తెలిపారు. పోలింగ్ ప్రక్రియకు అవసరమైన అన్ని పనులు ముందస్తు ప్రణాళికతో పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్, డీఎస్పీ గంగారెడ్డి, అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్, రిటర్నింగ్ అధికారులు, పోలీస్ అధికారులు, రవాణాశాఖ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలుకు బయోమెట్రిక్

- అక్రమాలకు చెక్ పెట్టేందుకు సాంకేతిక పరిజ్ఞానం
- రైతు వేలిముద్ర వేశాకే ధాన్యం తూకం
- ఆధార్ తప్పనిసరి చేస్తూ నిబంధనలు
- ధాన్యం తీసుకువెళ్లే ట్రాక్టర్‌కు ట్రాకర్

నిర్మల్‌చైన్‌గేట్: ధాన్యం కొనుగోలుకు కొత్త విధానం అమలులోకి రానున్నది. ఈ వానాకాలం సీజన్ నుంచి రైతుల నుంచి బయోమెట్రిక్ లేదా ఐరిస్ సేకరించిన తర్వాతే ధాన్యం కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు అన్ని కొనుగోలు కేంద్రాలు బయోమెట్రిక్ పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా జరిగేందుకు తీసుకుంటున్న చర్యల్లో భాగంగా ఈ బయోమెట్రిక్ విధానాన్ని తెర మీదికి తీసుకువచ్చింది. కొనుగోళ్లలో అక్రమాలకు ముకుతాడు వేయాలనే ఉద్దేశంతోనే కొత్త విధానానికి శ్రీకారం చుట్టినట్లు తెలుస్తోంది.

**వేలిముద్ర వేశాకే..**


ఆరుగాలం శ్రమించే అన్నదాత కష్టానికి ప్రతిఫలం ఉండాలి. గిట్టుబాటు ధర దక్కకపోతే రైతులకు నష్టాలే మిగులుతాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని కేంద్రం ధాన్యానికి మద్దతు ధర కల్పిస్తోంది. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ సీజన్‌లోనూ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తూ ధాన్యం సేకరిస్తోంది. ఇంతవరకు బాగానే ఉన్నా.. అక్కడక్కడా అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. వీటిని కట్టడి చేసే దిశగా ప్రభుత్వం ఈ బయోమెట్రిక్ విధానం అమలులోకి తీసుకురావాలని నిర్ణయించింది. కొనుగోలు కేంద్రాల్లో కొన్నిచోట్ల తూకంలో తేడాలతో రైతులను మోసం చేస్తున్నారు. నిబంధనలకు మించి తరుగు పేరిట తీసుకున్న ధాన్యాన్ని బోగస్ రైతుల పేరిట విక్రయిస్తున్నారు. మిల్లర్లు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు కుమ్మక్కవుతున్నారు. మిల్లర్లు సేకరించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో అమ్ముతున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ఇక మీదట ఇలాంటి అక్రమాలకు తావుండదు. ఈమేరకు బయోమెట్రిక్ ఆధారిత కొనుగోళ్ల విధానాన్ని కేంద్రం తీసుకువచ్చింది. రైతు వేలిముద్ర బయోమెట్రిక్ యంత్రంపై వేశాకే తూకం వేస్తారు. రైతువారీగా కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ఎప్పటికప్పుడు ట్యాబ్‌లో నమోదు చేయడం ద్వారా చెల్లింపులు జరిగే అవకాశం ఉంటుంది.

**ఆధార్ తప్పనిసరి..**

ధాన్యం కొనుగోళ్లకు బయోమెట్రిక్ విధానం అమలు చేయనున్న నేపథ్యంలో వరిసాగు చేసిన రైతులు ఆధార్ నవీకరణ చేసుకోవడం ముఖ్యం. ఆధార్ నవీకరణ లేకపోతే వేలిముద్ర సరిపోక ధాన్యం విక్రయాలు చేయడం కష్టంగా మారనుంది. ఇదే విషయాన్ని అధికారులు రైతులకు స్పష్టం చేస్తున్నారు. ప్రస్తుతం రేషన్ కార్డుల ఈ-కేవైసీ పునరుద్ధరణతో పాటు ఆధార్‌కార్డు నవీకరణ కూడా పూర్తి చేసుకుంటే ధాన్యం విక్రయించే సమయంలో సమస్య ఉండదంటున్నారు. ఆధార్ కార్డు లేని వారు వాటిని తప్పకుండా తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. లేకుంటే ధాన్యం విక్రయంలో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని చెబుతున్నారు.

**ట్రాక్టర్‌కు ట్రాకర్...**

సేకరించిన ధాన్యం పక్కదారి పట్టకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు ధాన్యం తరలించే వాహనాలకు జీపీఎస్ ట్రాకర్‌ను అమర్చనున్నారు. దీనితో కొనుగోలు కేంద్రాల నుంచి వారికి కేటాయించిన మిల్లు వరకు వాహనం సక్రమంగా వెళ్తుంది.. లేనిది తెలుసుకోవచ్చు. మిల్లర్లు సేకరించిన ధాన్యం కొనుగోలు కేంద్రానికి రాకుండా ఉండడం కోసం ట్రాకింగ్ వ్యవస్థను ఉపయోగించాలని నిర్ణయించారు. ఈ కొత్త విధానంపై కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తారు.



**1.33 లక్షల మెట్రిక్ టన్నుల లక్ష్యం..**

జిల్లాలో ఈ వానాకాలంలో 202 కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుంచి 1.33 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని అధికారులు ఇప్పటికే ప్రణాళికలను రూపొందించారు. 2023-24 ఖరీఫ్ సీజన్‌లో దాదాపు 1.46 లక్షల ఎకరాలలో వరి సాగు అయింది. 1.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు. జిల్లాలో 202 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ధాన్యం ఏ గ్రేడ్ ధర రూ.2,203, బీ గ్రేడ్ రూ.2,183. జిల్లాలో ధాన్యం సేకరణ నవంబర్ మొదటి వారం నుంచి మొదలై జనవరి నెలాఖరు వరకు కొనసాగనుంది.

### వేలిముద్ర వేశాకే తూకం

ఈ వానాకాలం సీజన్‌లో రైతుల నుంచి బయోమెట్రిక్ లేదా ఐడీ సేకరించిన తర్వాతే ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది ఈ మేరకు అన్ని కొనుగోలు కేంద్రాలలో బయోమెట్రిక్ పరికరాలు అందుబాటులో ఉంచుతాం. రైతు వేలిముద్ర వేశాకే కొనుగోలు చేపడుతాం. బయోమెట్రిక్ ఆధార్ కొనుగోలు ద్వారా అవకతవకలకు అడ్డుకట్ట వేయవచ్చు.

– షేక్ మహమ్మద్ అలీ, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి

# ఈవీఎం-విశేషాలు..

- పారదర్శక ఓటింగ్‌కు భరోసా
- మొదటిసారి 1982లో కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో వినియోగం



ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ (ఈవీఎం)

**భైంసాటౌన్(ముధోల్):** సమర్థవంత ఎన్నికల నిర్వహణకు కేంద్ర ఎన్నికల సంఘం అనేక సంస్కరణలు చేపట్టింది. ఇందులో భాగంగా బ్యాలెట్ బాక్స్ మొదలు ఈవీఎం(ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్) వరకు ఓటింగ్ విధానంలో మార్పులు తెచ్చింది. ఈవీఎం, వీవీప్యాట్, నోటా లాంటి నూతన విధానాలతో పారదర్శక ఓటింగ్‌కు భరోసానిస్తోంది. 1999 ఎన్నికల్లో బ్యాలెట్ పత్రాల ముద్రణకు 7,700 టన్నుల కాగితం వాడారు. 2009 సార్వత్రిక ఎన్నికల్లో ఓటింగ్ కోసం ఈవీఎం వాడడంతో 10 వేల టన్నుల కాగితం మిగిలింది. ఈవీఎంలను మొదటిసారిగా 1982లో కేరళ రాష్ట్రంలోని పర్వూర్ అసెంబ్లీ ఎన్నికల్లో ఉపయోగించారు. ఈవీఎంలపై నెలకొన్న సందేహాలకు నివృత్తిగా పలు సమాధానాలను ఎన్నికల సంఘం తన వెబ్‌సైట్‌లో పొందుపర్చింది. నవంబర్ 30న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఈవీఎం విశేషాలపై కథనం..

### ఈవీఎం అంటే?

ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్. ఇది ఎన్నికల్లో పోలైన ఓట్లను ఎలక్ట్రానిక్ పద్ధతిలో రికార్డు చేయడంతో పాటు లెక్కించే పరికరం. ఈవీఎంలో బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్‌తో పాటు జతగా వీవీప్యాట్ (ఓటర్ వెరిఫైబుల్ పేపర్ ఆడిట్ ట్రయల్) ఉంటుంది.

### రవాణా సులభం..

బ్యాలెట్ బాక్సులతో పోలిస్తే ఈవీఎంల రవాణ చాలా సులభం. తేలికంగా, పోర్టబుల్‌గా ఉండడంతో దూరంగా, రోడ్డు సౌకర్యం లేనిప్రాంతాలకు సైతం వీటిని సులభంగా తరలించవచ్చు.

### గరిష్టంగా అభ్యర్థుల సంఖ్య, వేసే ఓట్లు..

ఈవీఎం బ్యాలెట్ యూనిట్‌లో నోటాతో పాటు 15 మంది అభ్యర్థుల పేర్లు మాత్రమే ఉంటాయి. ఒకవేళ అంతకంటే ఎక్కువ అభ్యర్థులు బరిలో ఉంటే మరో బ్యాలెట్ యూనిట్‌ను వినియోగించాల్సి ఉంటుంది. ఇలా ఒక ఈవీఎంకు 24 బ్యాలెట్ యూనిట్లు అనుసంధానించవచ్చు. తద్వారా 384 మంది అభ్యర్థుల వరకు సేవలు అందిస్తుంది. ఇక ఓట్ల విషయానికి వస్తే గరిష్టంగా 2 వేల ఓట్లను రికార్డు చేస్తుంది. కానీ ఎన్నికల్లో సాధారణంగా 1500 ఓట్లను నమోదు చేయడానికి మాత్రమే ఉపయోగిస్తున్నారు.

### ఓటు ఎలా వేయవచ్చు?

ఈవీఎం ఓటింగ్ విధానంలో కంట్రోల్ యూనిట్ ప్రిసైడింగ్ అధికారి వద్ద, బ్యాలెట్ యూనిట్, వీవీప్యాట్ ఓటింగ్ కంపార్ట్‌మెంట్‌లో ఉంటుంది. బ్యాలెట్ యూనిట్‌పై ఓటరు తనకు నచ్చిన అభ్యర్థి గుర్తుకు ఎదురుగా ఉన్న బ్లూబటన్ నొక్కగానే ఎరుపురంగు లైట్ మెరుస్తుంది. ఎంపిక చేసుకున్న అభ్యర్థి సీరియల్ నంబర్, పేరు, గుర్తు చూపించే పేపర్ స్లిప్ వీవీప్యాట్ విండో ద్వారా సుమారు 7 సెకన్ల పాటు కనిపించి డ్రాప్‌బాక్స్‌లో పడగానే కొద్దిసేపు బీప్ అనే శబ్దం వస్తుంది. దీంతో ఓటు నమోదైందని తెలుసుకోవచ్చు.

### విద్యుత్ లేని ప్రాంతాల్లో..

ఈవీఎంలకు విద్యుత్ సరఫరా అవసరం లేదు. ఈవీఎం, వీవీప్యాట్‌లకు సొంతంగా బ్యాటరీ/పవర్-ప్యాక్ సౌకర్యం ఉండడంతో విద్యుత్ సరఫరా లేని ప్రాంతాల్లో సైతం వీటిని వినియోగించవచ్చు.

### ఈవీఎం మొరాయిస్తే..

పోలింగ్ సమయంలో బ్యాలెట్, కంట్రోల్ యూనిట్ క్రమం తప్పితే బ్యాలట్, కంట్రోల్ యూనిట్‌తో పాటు వీవీప్యాట్‌తో కూడిన కొత్త సెట్ ఏర్పాటు చేస్తారు. పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో రిజర్వ్ దశ నుంచి పనిచేయని దశ వరకు నమోదైన ఓట్లు, కంట్రోల్ యూనిట్, వీవీప్యాట్ బ్యాలెట్ స్లిప్‌లు కంపార్ట్‌మెంట్ మెమరీలో భద్రంగా ఉంటాయి. వీవీప్యాట్ మాత్రమే పనిచేయకపోతే కంట్రోల్ యూనిట్‌లో నమోదైన ఓట్లు దాని మెమరీలో భద్రంగా ఉంటాయి. దీంతో రిజర్వ్ మెషిన్ల నుంచి పనిచేయని వీవీప్యాట్ తొలగించి మరొకటి ఏర్పాటు చేసిన తర్వాత పోలింగ్ తిరిగి ప్రారంభిస్తారు. ఏదైనా సాంకేతిక కారణాలతో కంట్రోల్ యూనిట్‌లలో నమోదైన ఓట్లను నిర్ధారించకపోతే కంట్రోల్ యూనిట్ వీవీప్యాట్ స్లిప్‌లను లెక్కిస్తారు.

### నిర్ధారించుకున్న తర్వాతే పోలింగ్..

పోలింగ్ ప్రారంభానికి ముందు కంట్రోల్ యూనిట్‌లో రిజల్ట్ బటన్‌ను నొక్కి ఇప్పటికే 'దాచిన' ఓట్లేవీ నమోదు కాలేదని ప్రిసైడింగ్ అధికారి హాజరైన పోలింగ్ ఏజెంట్లకు ప్రదర్శిస్తారు. వీవీప్యాట్ డ్రాప్‌బాక్స్ తెరిచి ఖాళీగా ఉందని చూపుతారు. వారి సమక్షంలో కనీసం 50 ఓట్లతో మాక్ పోల్ నిర్వహిస్తారు. ఆ తర్వాత ఆ ఫలితాన్ని క్లియర్ చేసి అసలు పోల్ ప్రారంభించే ముందు పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో కంట్రోల్ యూనిట్, వీవీప్యాట్‌కు సీలు వేస్తారు.

### ఓటరు ఫిర్యాదు చేయవచ్చు

ఓటరు ఓటును నమోదు చేసిన తర్వాత వీవీప్యాట్‌లో కనిపించే పేపర్ స్లిప్‌లో ఓటు వేసిన అభ్యర్థి కాకుండా వేరే అభ్యర్థి పేరు, గుర్తు వచ్చినట్లయితే రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలి. నిజమని తేలితే ఆ ఓటింగ్ యంత్రంలో తరువాతి ఓట్ల నమోదును నిలిపివేసి రిటర్నింగ్ అధికారి ఇచ్చిన ఆదేశాల ప్రకారం నడుచుకుంటారు.

### పోలైన ఓట్ల సంఖ్య ఇలా తెలుసుకోవచ్చు..

ఈవీఎం కంట్రోల్ యూనిట్‌లో ఫలితం బటన్‌తో పాటు, టోటల్ బటన్ ఉంటుంది. పోల్ సమయంలో ఎప్పుడైనా ఈ బటన్ నొక్కితే అప్పటి వరకు పోలైన మొత్తం ఓట్ల సంఖ్య తెలుస్తుంది. పోలింగ్ ముగియగానే క్లోజ్ బటన్ నొక్కితే మెషిన్ ఇకపై ఓట్లను అంగీకరించదు.

### ఈవీఎంల భద్రత..

పోలింగ్ తర్వాత ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్‌లో సెక్యూరిటీ బలగాల పహారాలో భద్రపరుస్తారు. అభ్యర్థులు నియమించిన ఏజెంట్లు కౌంటింగ్ వరకు ఈవీఎంలను 24 గంటలూ చూసేందుకు అనుమతిస్తారు. ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్‌లకు తాళాలు వేసి ఎన్నికల అధికారులతో పాటు అభ్యర్థులు లేదా వారి ప్రతినిధుల సంతకాలతో సీలు వేస్తారు.

### కౌంటింగ్ డే..

కౌంటింగ్ రోజున అభ్యర్థులు/వారి ప్రతినిధులు, రిటర్నింగ్ అధికారి, ఎన్నికల సంఘం పరిశీలకుల సమక్షంలో ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ తెరుస్తారు. అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్ల సమక్షంలో ఓట్ల లెక్కింపు జరుగుతుంది. లెక్కింపు పూర్తయిన తర్వాత, వీవీప్యాట్ స్లిప్‌లను బయటకు తీసి, అభ్యర్థులు/వారి ప్రతినిధుల సమక్షంలో నల్లటి కవరులో భద్రపరుస్తారు.

## క్లుప్తంగా

### ఎన్నికలు బహిష్కరించిన భగవాన్‌పూర్ వాసులు



ఫ్లెక్సీ చూపుతున్న గ్రామస్తులు

**తాంసి(బోథ్):** తమ గ్రామానికి రోడ్డు నిర్మాణం చేపట్టే వరకూ ఎన్నికల్లో ఓటు వేయమని, ఎన్నికలు బహిష్కరిస్తున్నట్లు భీంపూర్ మండలంలోని భగవాన్‌పూర్ గిరిజనులు తీర్మానం చేశారు. తమ గ్రామానికి రోడ్డు లేక అనేక ఏళ్లుగా అవస్థలు పడుతున్నామని వాపోయారు. ఎన్నికలు బహిష్కరిస్తున్నట్లు గురువారం అధికారులకు వినతిపత్రం అందించినట్లు తెలిపారు. తమ గ్రామానికి ఎన్నికల ప్రచారానికి ఎవరూ రావద్దని శనివారం ఫ్లెక్సీ ఏర్పాటు చేసి నిరసన వ్యక్తం చేశారు.

### జాతీయస్థాయి పోటీల్లో గోల్డ్‌మెడల్




గోల్డ్‌మెడల్ అందుకుంటున్న తరుణ్

**ఆదిలాబాద్:** జిల్లా కేంద్రంలోని తెలంగాణ క్రీడా పాఠశాలకు చెందిన విద్యార్థి తరుణ్ జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటాడు. జమ్మూ కాశ్మీర్లోని తావీలో ఈనెల 14 నుంచి 18 వరకు నిర్వహించిన 67వ జాతీయ పాఠశాల క్రీడా సమాఖ్య పోటీల్లో జూడో క్రీడలో పాల్గొని బంగారు పతకం సాధించాడు. తెలంగాణ నుంచి మొత్తం 14 మంది పోటీలకు ప్రాతినిధ్యం వహించగా తరుణ్ పతకం సాధించడం విశేషం. అండర్ 14 విభాగంలో మైనస్ 50 కేజీల ఈవెంట్లో గోల్డ్ మెడల్ సాధించాడని కోచ్ రాజు తెలిపారు. సాట్స్ చైర్మన్ ఆంజనేయగౌడ్, డెప్యూటీ డైరెక్టర్ ధనలక్ష్మి, జేఎఫ్ఐ జనరల్ సెక్రెటరీ జనార్దన్‌రెడ్డి, డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు, జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, ఎస్జీఎఫ్ కాంతారావ్ అభినందనలు తెలిపారు.

### గంజాయి విక్రేత అరెస్టు

**నిర్మల్‌రూరల్:** జిల్లా కేంద్రంలో శనివారం గంజాయి అమ్ముతున్న ఒకరిని అరెస్టు చేసినట్లు రూరల్ ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు విశ్వనాథ్ పేటకు చెందిన అబ్దుల్ ముక్తార్‌ను తనిఖీ చేయగా అతని వద్ద 50 గ్రాముల గంజాయి దొరికింది. స్థానిక యువకులకు చిన్న చిన్న పొట్లాలు చేసి రూ.100కు ఒకటి చొప్పున అమ్ముతున్నట్లు విచారణలో తేలిందన్నారు. నిందితుడిని అరెస్టు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

### పశుగ్రాసంగా మారిన పత్తి పంట

**తాంసి:** ఈ ఏడాది సాగు చేసిన పత్తి పంట అనుకున్నంత దిగుబడి రాక పెట్టుబడి కూడా వెళ్లని పరిస్థితుల్లో పలువురు రైతులు పశువులకు మేతగా వదిలేస్తున్నారు. తాంసి మండలంలోని వడ్డాడి గ్రామానికి చెందిన కేమ పొచ్చన్న తనకున్న 2.5 ఎకరాల్లో పత్తి సాగు చేయగా కేవలం పది క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చింది. కనీసం పెట్టుబడి సైతం రాకపోవడంతో శనివారం పత్తిచేలలో పశువులను వదిలేశాడు. పత్తిని తొలగించి ఇతర పంట ఏదైనా సాగు చేయాలని పశువులను వదిలేసినట్లు రైతు తెలిపాడు.

### స్వీట్ నీకు.. అమ్మానాన్నల ఓటు నాకు..



'చిన్నా.. ఇదిగో ఈ స్వీట్ నీకు.. మీ అమ్మానాన్నల ఓటు మాత్రం నాకే..' అన్నట్లుగా మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఓ చిన్నారికి ఇలా స్వీట్ తినిపించారు. సోన్ మండలంలోని లెఫ్ట్ పోచంపాడ్‌లో శనివారం ప్రచారం నిర్వహిస్తుండగా స్వీట్ తీసుకుని వచ్చిన చిన్నారికి మంత్రి ఇలా తినిపించడం ఆకట్టుకుంది.

- నిర్మల్

### చింతగూడలో ఐటీ అధికారుల సోదాలు

- ఎన్నికల నగదు డంప్ ఉందనే సమాచారంతో..



సోదా చేస్తున్న ఐటీ, ఎఫ్ఎస్టీ అధికారులు

**గుడిహత్నూర్(బోథ్):** ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలంలోని చింతగూడలో ఐటీ అధికారుల సోదాలు శనివారం హల్‌చల్ చేశాయి. తమ ఇళ్లలో సోదాలు నిర్వహిస్తుండడంతో గ్రామస్తులు ఒక్కసారిగా ఆందోళన చెందారు. ఎన్నికల నేపథ్యంలో పంపిణీ చేసేందుకు గాను గ్రామంలో భారీగా నగదు డంప్ చేశారని సమాచారంతో ఐటీ అధికారులు గ్రామానికి చేరుకున్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్, పోలీసుల సహకారంతో ప్రతీ ఇంటిని జల్లెడ పట్టారు. అయితే ఈ సోదాల్లో ఎలాంటి నగదు లభించలేదని అధికారులు వెల్లడించారు. ఈ దాడుల్లో ఎస్సై ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

## అధిక సాంద్రత పద్ధతితో అధిక దిగుబడి



పల్సికేలో పరిశీలిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

**తలమడుగు(బోథ్):** అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేయడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని కేవీకే సమన్వయకర్త డాక్టర్ వై.ప్రవీణ్ కుమార్ అన్నారు. శనివారం తలమడుగు మండలంలోని పల్సి కేలో అధిక సాంద్రతలో పత్తి సాగు చేసిన పంట పొలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక సాంద్రత విధానంలో పత్తి పంట సాగు చేయడం ద్వారా ఎకరాకు ఐదు నుంచి ఎనిమిది క్వింటాళ్ల పత్తి దిగుబడి అధికంగా వస్తుందన్నారు. ఈ విధానంపై పలు గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించామన్నారు. అధిక సాంద్రత పద్ధతిలో మధ్యమధ్యలో ఇతర పంటలు సాగు చేయడం ద్వారా అధిక దిగుబడి వస్తుందన్నారు. రైతులు అధిక సాంద్రతపై మొగ్గు చూపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్, రాజశేఖర్, మోహన్‌దాస్, శివశరణ్, ప్రాజెక్టు ఫీల్డ్ అసిస్టెంట్ దిలీప్, సాయి, మల్లేశ్, రైతులు పాల్గొన్నారు.

## నిరంతర సాధనతోనే విజయాలు సాధ్యం



స్విమ్మింగ్ పోటీలు ప్రారంభిస్తున్న జిల్లా గిరిజన క్రీడల అభివృద్ధి అధికారి పార్థసారథి

**ఆదిలాబాద్:** నిరంతర సాధనతోనే విజయాలు సాధ్యమని జిల్లా గిరిజన క్రీడల అభివృద్ధి అధికారి పార్థసారథి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో శనివారం ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా జోనల్ స్థాయి అండర్ 14, 17 బాలబాలికల స్విమ్మింగ్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్విమ్మింగ్‌తో శరీరంలోని ప్రతి అవయవానికి వ్యాయామం చేయబడుతుందన్నారు. సమ్మర్‌లోనే అనేక మంది స్విమ్మింగ్ నేర్చుకుంటున్నారని, అనంతరం మానేస్తున్నారన్నారు. రెగ్యులర్‌గా సాధన చేస్తూ రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనాలని ఆకాంక్షించారు. అనంతరం విజేతలకు మెడల్స్ అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ కార్యదర్శి కాంతారావ్, కోచ్ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

### వివాహం కావడంలేదని యువకుడు ఆత్మహత్య



రాంచందర్ (ఫైల్)

**సోన్(నిర్మల్):** వివాహం కావడంలేదని మనస్తాపంతో ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సంతోషం రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కడ్తాల్ గ్రామానికి చెందిన పందిరి లింగన్న, పోశాని దంపతుల కుమారుడు రాంచందర్ (32)పెళ్లి సంబంధాలు కుదరడంలేదని కొంతకాలంగా మనస్తాపం చెందుతున్నాడు. శనివారం ఉదయం ఇంట్లో బయటకు వెళ్లి గ్రామ శివారులోని వేపచెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని తల్లి పోసాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

### ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి



భూమన్న మృతదేహం

**లక్ష్మణచాంద(నిర్మల్):** ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని వడ్యాల్‌లో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గురియ భూమన్న (50)పశువుల కాపరిగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం తెల్లవారుజామున బహిర్భూమికి గ్రామ సమీపంలోని చెరువు వద్దకు వెళ్లాడు. ఎంతకూ ఇంటికి రాకపోవడంతో అతని భార్య భీమవ్వ చెరువు వద్దకు వెళ్లి చూడగా చెరువులో మృతదేహం తేలియాడి ఉంది. భీమవ్వ ర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

### మద్యం పట్టివేత



ఇంద్రవెల్లిలో స్వాధీనం చేసుకున్న మద్యం

**ఇంద్రవెల్లి(ఖానాపూర్):** మండల కేంద్రంలో నిచిచ్‌ధరి ఖానాపూర్ రోడ్ పక్కనే అక్రమంగా బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న టగ్రే ఇందల్ దుకాణంలో శనివారం పోలీసులు, ఎక్సైజ్ అధికారులు నిర్వహించిన దాడుల్లో రూ.24,200ల విలువైన మద్యం పట్టుబడినట్లు ఎస్సై దుబ్బాక సునీల్ తెలిపారు. మద్యం స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. అక్రమంగా బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

**ఎదులాపురం:** జిల్లాలోని పలు ప్రాంతాల్లో సీసీఎస్ పోలీసులు దాడులు నిర్వహించారు. సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ సాయినాథ్ ఆధ్వర్యంలో ఆదిలాబాద్, ఇచ్చోడలో బెల్ట్ షాపులపై దాడులు నిర్వహించారు. ఖానాపూర్ కాలనీలో పెండల సంతోష్ వద్ద రూ.3,740 విలువ చేసే 20 మద్యం బాటిళ్లు, ఇచ్చోడలో ఇందల్ సింగ్ అనే బెల్ట్ షాపు నిర్వాహకుని వద్ద రూ. 25,000 విలువ చేసే 212 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని సంబంధిత పోలీస్ స్టేషన్లలో కేసు నమోదు చేశారు.

### ఒకేరోజు మూడు ఆలయాల్లో చోరీ



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

**గుడిహత్నూర్(బోథ్):** మండలంలోని మచ్చాపూర్‌తాండ, ముత్నూర్‌తాండ, రావుతాండ గ్రామాల్లోని దుర్గామాత ఆలయాల్లో శుక్రవారం రాత్రి చోరీ జరిగినట్లు గ్రామ పెద్దలు ప్రతాప్ సింగ్, గున్వంత్, రాంజీ, జైపాల్ తెలిపారు. అర్ధరాత్రి దాటాక దొంగలు ఒకే రూట్‌లోని కిలో మీటర్ దూరంలో ఉన్న ఈ ఆలయాల్లో చొరబడి రూ.3లక్షల విలువైన ఆభరణాలు అపహరించినట్లు వారు పేర్కొన్నారు. శనివారం ఉదయం గుర్తించి పోలీసులు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఎస్సై ఇమ్రాన్ సంఘటనా స్థలాలకు చేరుకుని క్లూస్ టీంను వేలిముద్రలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు. క్లూస్ టీం ఎస్సై శ్రీనివాస్, సిబ్బంది రమేశ్, భూమన్న, తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంత ఎన్నికలకు ఫ్లాగ్‌మార్చ్




ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న బలగాలు

**ఉట్నూర్‌రూరల్(ఖానాపూర్):** ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ముందస్తుగా మండలంలోని శ్యాంపూర్‌లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించినట్లు డీఎస్పీ నాగేందర్ తెలిపారు. శనివారం పోలీసుల ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల దృష్ట్యా జిల్లా వ్యాప్తంగా శాంతి భద్రతల పరిరక్షణ కోసం ఫ్లాగ్‌మార్చ్ చేపడుతున్నామన్నారు. ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఉట్నూర్ సీఐ రామకృష్ణ, ఎస్సై మనోహర్, సిబ్బంది పాల్గొన్నారు.

### 'ప్రియాంకాగాంధీ సభను జయప్రదం చేయాలి'



ఏర్పాట్లు పరిశీలిస్తున్న వెడ్మ బొజ్జు

**ఖానాపూర్:** ఖానాపూర్‌లో ఆదివారం నిర్వహించనున్న కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ భారీ బహిరంగసభను జయప్రదం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఖానాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి వెడ్మ బొజ్జు కోరారు. శనివారం మండలంలోని సుర్జాపూర్ ఎన్టీఆర్ చౌరస్తా ప్రాంతంలో పార్టీ శ్రేణులతో కలిసి ఏర్పాట్లపై చర్చించారు. సభకు నియోజకవర్గంలోని 8 మండలాల నుంచి భారీగా జనసమీకరణ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సత్తు మల్లేశ్, దయానంద్, చిన్నం సత్యం, షబ్బీర్‌పాషా, నిమ్మల రమేశ్, మజీద్, గంగనర్సయ్య, తోట సత్యం, గుగ్లావత్ రాజు, జంగిలి శంకర్, షౌకత్‌పాషా, జహీర్ హైమద్, మాసుల లక్ష్మీరాజం, గంగరాజం, సజ్జు, మీర్జాబేగ్, మైస శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

### బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తలపై కేసు నమోదు

**నిర్మల్‌రూరల్:** మండలంలోని ముజ్గిలో శుక్రవారం రాత్రి బీఆర్ఎస్ అభ్యర్థి ఐకేరెడ్డి ఎన్నికల ప్రచారాన్ని అడ్డుకున్న బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తలపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. గ్రామానికి చెందిన బొడ్డు చిన్న మహేందర్, సాయన్న, జక్కుల గంగయ్య, చుక్కల సందీప్, కందెల ప్రసాద్, మహేందర్, చిన్న మల్లయ్య, రాజుల ప్రవీణ్ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల ప్రచారాన్ని అడ్డుకున్నారన్నారు. ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులు ఇచ్చిన దరఖాస్తు మేరకు వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

### చికిత్స పొందుతూ ఒకరు మృతి

**ఎదులాపురం:** జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందినట్లు హెడ్ కానిస్టేబుల్ విజయ్‌కుమార్ తెలిపారు. మహారాష్ట్రలోని కిన్వట్ తాలూకా గణేశ్‌పూర్‌కు చెందిన కోడిపే రోషన్ (29) మద్యానికి బానిసయ్యాడు. ఈ నెల 16న మద్యం మత్తులో గుర్తు తెలియని మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించి శుక్రవారం రాత్రి మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

### 'ప్రజల మధ్య విభేదాలు తెస్తున్న బీజేపీకి బుద్ధి చెప్పాలి'



మాట్లాడుతున్న నూతన్ కుమార్

**ఖానాపూర్:** ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రజల మధ్య విభేదాలు తెస్తున్న బీజేపీకి ప్రజలు బుద్ధి చెప్పాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నూతన్‌కుమార్ కోరారు. శనివారం మండలంలోని తర్లపాడ్ గ్రామంలో మాట్లాడారు. మతతత్వ పార్టీని ఓడించి లౌకిక వాదాన్ని ప్రజలు బలపర్చాలన్నారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతి, నర్సయ్య, భూమన్న, తదితరులు పాల్గొన్నారు.

### బాలిక అపహరణ

**ఎదులాపురం:** బాలిక అపహరణకు గురైన సంఘటన టుటౌన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని ఓ కాలనీకి చెందిన బాలిక (16)ను అదే కాలనీకి చెందిన బాలుడు (17) శుక్రవారం రాత్రి అపహరించాడు. ఈ మేరకు బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.